# సమస్య

శీతాకాలం. సాయంత్రం చలిగా లేదు. వాతావరణం ఆహ్లాదకరంగా వుంది.

ఇంటి తలుపు తట్టేను. కొత్త ఇల్లు. పాత స్నేహితురాలు. తెరుచుకున్న తలుపులు. ఎదురుగా నవ్వుతూ, ఆహ్వానిస్తూ అనిత.

నన్ను తన బంధువులకు పరిచయం చేసింది. నా చేతిలో బిడ్డను అందరూ ముద్దులాడేరు. టిఫిన్, టీ మర్యాదలు అయ్యేయి.

తర్వాత ఒక ఎ.సి. గదిలో ఇద్దరం కూర్చున్నాం. బొమ్మల మధ్య నా కూతురు దీప్తిని కూర్చోబెట్టి, మేమిద్దరం కబుర్లు;

"మీ ఆయన్ని, కొడుకునీ కూడా తీసుకుని వచ్చుంటే... వాళ్ళనూ చూద్దును కదా" అంది అనిత నిందాపూర్వకంగా.

"నా మొగుడు నా అదుపాజ్ఞలలో లేదు. సమయపాలన లేదు. ఫలానా టైముకి ఇంటికి వస్తానని చెప్పి హఠాత్తుగా హేండ్ ఇవ్వడమే అతని నైజం. రిమోట్ కంట్రోల్ నా చేతిలో లేదు. కంపెనీ మానేజ్ మెంట్ చేతిలో వుంది. తను ఈరోజు ఎంతో ఉత్సాహంగా, 'తప్పకుండా వెళదాం. పిల్లలతో రడీగా వుండు' అన్నాడు. రడీగా వున్నాక అయ్యగారి నుంచి రాలేనని ఫోను. ఏదో అర్జెంటు మీటింగ్‌లో ఇరుక్కుపోయడట. రేపు వెళదాం అన్నాడు– నువ్వు వుండవని తెల్సి కూడా.

నీ దగ్గర నాకు దాపరికం ఎందుకూ. అతన్ని నమ్ముకొని ఇంట్లో అవసరాల కోసం ఎదురు చూడడం ఎప్పుడో మానేశాను. ఇంటిపని ఎలానూ నేనే చేయాలి. బయట పనులు కూడా రోడ్డెక్కి నేనే చేసుకుంటాను.

ఆడబతుక్కి మొగుడూ, పిల్లలు ఎలానూ తప్పదు. ఇంట్లో అదనంగా

మామయ్య (ఏడు పదుల వయసు) మాతో వుండడం అదృష్టం. అత్తగారు లేకపోవడం దురదృష్టం అనను. వీధిలో నన్ను ఉతికేసి ఆరేయడాలు లేనందుకు నాకు మనశ్శాంతి లభించింది- అంతే!"

"మావయ్య దేవుడు. ఆయన నా కొడుకు భారాన్నంతా మోస్తూ, ఇంటి పనుల్లో కూడా సాయం చేస్తుంటారు. మొగుడి వల్ల నాకు ఎలాంటి సహకారం లేదు. ఉదయం వెళ్ళిపోయి రాత్రి తొమ్మిదింటికి వస్తారు. మావయ్యగారు లేకుంటే ఇద్దరు పిల్లలతో వేగలేక చచ్చిపోదుననుకో. బాబు అభిషేక్‌కి తల్లి, తండ్రీ అక్కర లేదు - తాతే కావాలి. ఎప్పుడూ తాత. తాత.

అభిషేక్‌ని తీసుకురాలేకపోయేవా అని అడిగావు కదా! తీసుకొద్దామని తయారుచేస్తే 'రాను ఫో' అనేశాడు. ఎంత బ్రతిమాలినా బయల్దేరలేదు"

"ఏం పిల్లలు షికార్లు అంటే సరదా పడతారుకదా"

"వాడికి షికార్లు అక్కరలేదు. వీధిలో పిల్లలూ అక్కరలేదు. తాతే వాడి ప్రపంచం. తాతను వదిలి రానన్నాడు"

"వండర్‌ఫుల్. చిత్రమైన తాతామనవళ్ళని మిస్ అయ్యేను. పోనీ వాళ్ళిద్దరినీ కలిపి నీ వెంటే తీసుకొని వచ్చేయాల్సింది"

నవ్వేను.

"నాకు నా పిల్లలిద్దరూ చాలదన్నట్టూ బన్నీ ఒకర్తి వుంది. అది మమ్మల్నెవ్వర్నీ వదిలి వుండలేదు. ఇంట్లో ఒక్కదాన్ని వదిలి వచ్చేస్తే, దాని అరుపులకి ఇరుగుపొరుగు అదిరిపోయి మమ్మల్ని తిట్టడంతో వూరుకోకుండా పోలీస్ రిపోర్ట్ ఇస్తారేమోనని భయం" అన్నాను.

"మీపై విశ్వాసం చూపే మరో ప్రాణి కూడా ఇంట్లో వుందన్న మాట. నా కెందుకో మీ బన్నీని కాదుగాని తాతామనవళ్ళని చూడాలని వుంది. నాది టైట్ షెడ్యూల్ ఐపోయింది. లేకుంటే మీ ఇంటి కొచ్చి వాళ్ళతో కాసేపు కూర్చుందును" అంది అనిత.

నేను, అనిత ఇంటర్ వరకూ క్లాస్‌మేట్స్‌మి. అంతకుమించి మంచి స్నేహితులము. ఎమ్‌సెట్‌లో తనకు మంచి ర్యాంక్ వచ్చి డాక్టరు చదువులవైపు వెళ్ళిపోయింది. నేను సింపుల్‌గా బియస్సీ చేసి పెళ్ళిపీటలు మీద కూర్చుండిపోయేను. అప్పుడప్పుడు కలుసుకోవడం, ఫోన్‌లో మాటాడుకోవడం వుండేది. అనిత పెళ్ళిచేసుకొని హైద్రాబాద్ వెళ్ళిపోయాక తనతో కమ్యూనికేషన్ తెగిపోయింది. సంసారంలో పడేక అనిత అనే కాదు, మొత్తం స్నేహితులందరినీ

మర్చిపోయాను.

అనిత హైదరాబాద్ నుంచి అమెరికాకి ఎగిరిపోయిన విషయమూ నాకు తెలియదు - తను ఈరోజు నాకు ఫోన్ చేసేవరకూ.

"రేవతీ, నిన్ను చూడాలని వుంది. నీ దగ్గరకు వచ్చే సమయం నాకు లేదు. అంచేత నీవే ఈరోజు సాయంత్రం వీలుచేసుకొని మా తమ్ముడి ఇంటికి రావాలి. తప్పక రావాలి" అని అడ్రసు, ఫోన్ నెంబరూ ఇచ్చింది.

చంటిదాన్ని ఎత్తుకొని నేను ఒక్కర్తినే రాగలిగేను.

నిజం చెప్పాలంటే నా రాకలో కొంత స్వార్థముంది. అనితను చూడాలనే కోరిక వున్నా, దానికన్నా బలమైన కారణం అనారోగ్యంతో బాధపడుతున్న దీప్తిని తనకు చూపించి, వైద్యసేవలు పొందాలని. అనిత డాక్టరు. పిల్లల డాక్టరు.

అనిత కుటుంబం ఇరవై రోజుల ప్రోగ్రాంతో ఇండియా వచ్చేరట. తను ఒక్కర్తే ఈరోజు బంధువుల గృహప్రవేశాని కొచ్చింది. రేపు ఉదయం వెళ్ళిపోతుంది. భర్తా, పిల్లలు హైదరాబాద్‌లో వున్నారు. తను ఒక్కతే వచ్చింది.

నాకు ఈ సాయంత్రం ఒక గంట సమయం కేటాయించింది. తర్వాత ఇంకేదో ముఖ్యమైన ప్రోగ్రాం వుందట. నాకు దొరికిన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఎన్నాళ్ళకో స్నేహితురాలిని చూశాననే తృప్తికన్నా, ఆమెలోనున్న డాక్టర్ చేత నా బిడ్డకు వైద్యం చేయించానన్న తృప్తే నాకు శాంతినిస్తుంది. మనోధైర్యాన్నిస్తుంది. నా గుండె కోతను ఉపశమింపజేస్తుంది.

సాధారణంగా మొదటి కాన్పు ఏ తల్లికైనా కష్టమంటారు. కాని నాకు భగవంతుని కృపవల్ల ప్రసవం సుఖంగానే అయింది. పుట్టిన కానించి ఇప్పటి వరకూ అభిషేక్ విషయంలో ఎలాంటి అనారోగ్య ఇబ్బందులు ఫేస్ చేయలేదు.

దీప్తి విషయంలోనైతే నెల తప్పిన రోజు నుంచే నరకాన్ని అనుభవించాను. వికారాలు, వాంతులూ నెలా,రెండు నెలలూ వుంటాయి. కాని దీప్తితో ఇంచుమించు తొమ్మిది నెలలూ బాధపడ్డాను. ఆరోగ్యం పుంజుకొని బంగారంలాంటి బిడ్డను కందామని ఏవేవో తింటే, కడుపులో ఏదీ ఇమిడేది కాదు. బక్కచిక్కిపోయి రోగినై పోయాను. మూడుసార్లు ఆస్పత్రిలో చేరి సెలిన్ వాటర్‌తోనూ, ఫ్లూయిడ్స్‌తోనూ ప్రాణాలు నిలుపుకున్నాను. బాధ భరించలేక అబార్షన్ చేయించేయమని మా శ్రీవారిని వేడుకున్నాను. నొప్పి ఆయనకి కాదు కదా! ఓదార్పు మంత్రాలతో నన్ను చంపేసాడు.

కాన్పు కష్టమయింది. సిజేరియన్ తప్పలేదు. ఆడబిడ్డ. పుట్టగానే ఏడ్చింది.

నన్నూ ఏడ్పించింది. తీవ్ర ఆందోళనకు గురిచేసింది. పుట్టిన రోజే దానికి ఫిట్స్ వచ్చాయి. ఏదో ఒక్కసారి కాదు. నాలుగుసార్లు. బోరున ఏడ్చాను. నా అదృష్టం. డాక్టర్లు సకాలంలో స్పందించి మంచి వైద్యమే చేసారు. పిల్ల బతికి బయటపడింది.

దీప్తికిపుడు వయసు ఏడాది మీద ఆరు నెలలు. చూడ్డానికి ఏడాది పిల్లలా కూడా వుండదు. వయసుకి తగ్గ బరువు పెరగడం లేదు. ఏ క్షణంలో మళ్ళీ ఫిట్స్ వచ్చేస్తాయేమోనని భయం. డాక్టర్ల వద్దకి పిల్లను తిప్పేను. గుణం కనబడ లేదు.

అంతా పూసగుచ్చినట్టు అనితకి చెప్పాను. నమ్మలేకపోయింది.

"ఎంచక్కా ఆడుకుంటోంది. బాగానే కన్పిస్తోంది. ఫిట్స్ అంటావేమిటి?" అంటూ దీప్తిని దగ్గరకు తీసుకుని చెక్ చేసింది.

టెస్టు రిపోర్టులు చూసింది. న్యూరాలాజికల్, మెటబాలిక్ టెస్టులు.

"పాపకి ఏ రోగం లేదు. నిశ్చింతగా వుండు" అంది.

"ఫిట్స్ మళ్ళీ రావా? పుట్టగానే దానికి ఆ మాయదారి రోగం రావడం ఏమిటీ?"

"దీప్తికి వచ్చిన ఫిట్స్‌ని నియోనేటివ్ సీజర్స్ అంటారు. ఆ ఫిట్స్ ఏ కారణంగా వచ్చాయో చెప్పడం కష్టం. మెదడులో ఏదో చిన్న ఇబ్బంది ఏర్పడి వుండొచ్చు. మెటబాలిక్ లోపం కావొచ్చు. లేదా నీ ప్రసవ సమయంలో పాప మెదడుకి తగినంత ఆక్సిజన్ అందకపోయి వుండొచ్చు. ఏదో చిన్న ఇన్ఫెక్షన్. అంతే. మళ్ళీ ఫిట్స్ రాలేదు కదా. భయంతో నీవు డాక్టరు దగ్గరకెళ్ళి టెస్టులు చేయించావు. నార్మల్‌గా వున్నాయి. అంచేత ఫిట్స్ విషయం పూర్తిగా మర్చిపో. ధైర్యంగా వుండు"

"మరి తిండి ఎందుకు తినడం లేదు. బరువెందుకు కోల్పోతుంది?"

"రేవతీ, నీ కూతురు తిండి తినకపోవడానికి, ఫిట్స్‌కి ఏమాత్రం సంబంధం లేదు. దీనికి కూడా ట్రీట్‌మెంట్ ఇప్పించావు. అవునా! నువ్వు చేయించిన బ్లడ్ టెస్టు రిపోర్టులు చూశాను. రక్తంలో లెడ్ పాళ్ళు ఉన్నాయోమోనన్న పరీక్ష కూడా చేశారు. రిపోర్టులు బాగున్నాయి. నులి పురుగుల మందు కూడా దీప్తికి మింగించావు. ఏవో మందులు కూడా వాడుతున్నావు. నిక్షేపంగా వుంది పిల్ల. ఇక ఏ మందులూ వాడొద్దు. పారేయ్. నీ కూతురికేం రోగం లేదు. నిశ్చింతగా వుండు"

"తిండి తినడం లేదు అనితా"

"ఒప్పుకోను. తిండి తినకుండా నీ కూతురు ఇంత కళగా ఎందుకుంటుంది? నీవు పెట్టిందంతా తినడం లేదు. కొంత తింటుందిగా... దీప్తి ఏది ఇష్టంగా తింటుందో అది గమనించు. ఏదో న్యూట్రిటివ్ ఫుడ్ అని పిల్ల నోట్లో కూరేస్తానంటే

ఎట్లా? పిల్లలకి ప్రతి ముద్ద మారాం చేసి తినడం అలవాటైపోయింది. చందమామ చూపించో, మంత్రించో, మాయ చేసో, నవ్వించో తల్లులు ఒక్కో ముద్ద నోట్లో పెడతారు. తిండి తినే పద్ధతి ఇదే కాబోలు అని పిల్లలు అనుకుంటారు. నీవు ఎత్తుకొని తినిపించడం కాకుండా... ఏడాది దాటిందిగా, కూర్చోని తన తిండి తనే తినేలా అలవాటు చేయాలి"

"సరిపోయింది. ఏదో సామెత చెప్పినట్టుంది నీ సలహా... ఎంత కిందామీద పడినా అది తినడం లేదే తల్లీ అంటే పిల్లనే తినేలా చూడమంటున్నావు. దాని వయసెంతా? 'తిను తల్లీ' అని భోజనం ప్లేటు ఎదురుగా పెడితే ఏం చేస్తుంది? అన్నం మెతుకులు జల్లేసి ప్లేటుతో ఆడుకుంటుంది"

"నీవన్నది కాదనడంలేదు. పిల్లలు తొలుత అలానే చేస్తారు. తర్వాత నెమ్మది నెమ్మదిగా బుద్ధిగా తినడం మొదలెడతారు. ముందు నీ ప్రయత్నం చేయి"

"నీవు చెప్పేది అమెరికా పిల్లలకి వర్తిస్తుందేమో. దీప్తికి ఈ వయసులోనే స్వతంత్రంగా తినడం అలవాటు చేయమంటున్నావు. మా అభిషేక్ వయసు అయిదేళ్ళు...వాడి తిండి వాడే తన చేతులతో బుద్ధిగా తింటున్నాడనుకుంటున్నావా? నేను తినిపిస్తాను లేదా వాడి తాత తినిపిస్తాడు. ఎక్కువగా తాతే! వాడికి తిండి తినిపించడానికి తలప్రాణం తోకకి వస్తుంది. అభిషేక్ అటూ ఇటూ పరిగెడుతూ తాతని ఒక ఆట ఆడించి గంటసేపు తింటాడు పిడికెడు అన్నం. ఆ తినే తిండి కూడా వాడు అడిగిందే పెట్టాలి. మనం పెట్టింది తినడు. అంచేత నేను వాడిని ముందుగా అడుగుతాను - ఉదయం టిఫిన్ ఏమిటి తింటావ్? భోజనం ఏమిటి వండాలి అని. వాడిని అడగకుండా మనం వండుకున్నది తినమంటే పెద్ద పేచీ పెట్టేస్తాడు. ఏడుపు లంకించుకుంటాడు"

"అప్పుడు నీవేం చేస్తావ్?"

"వాడికి దగ్గరకు తీసుకొని బ్రతిమిలాడుతాను. లంచం ఇచ్చినట్టు బహుమతులూ, బొమ్మలూ చేతిలో పెట్టి ఏడ్వకుండా చూస్తాను"

"ఏడిస్తే ఏం?"

"అదేంటి అనిత. పిల్లలు, నా రక్తం పంచుకు పుట్టిన చంటిపిల్లలు ఏడుస్తుంటే నేనెలా చూస్తూ వూర్కోగలను? వాడి ఏడుపు ఆగేవరకూ నా వూపిరి ఆడదు. వాడిని శాంతింపజేశాకే నాకు మనశ్శాంతి"

"స్కూల్‌కి బాక్స్ తీసుకెళ్తాడు కదా"

"తీసుకువెళ్తాడు. అది కూడా వాడిని అడిగే కట్టాలి"

"ఏం తింటాడో అది పెట్టడంలో తప్పులేదు. స్కూల్లో వాడికి ఎవరు తినిపిస్తారు? ఆయా లేక నీవు వెళ్తావా?"

"లోనకి ఎవరినీ అనుమతించరు. అంచేత వాడే తింటాడు"

"స్కూల్లో తినగాలేనిది ఇంట్లో తినడానికేం?"

"ఎలా తింటే ఏం అనితా. సంతృప్తిగా ఆకలి తీరేలా తింటే చాలు కదా"

"ఇంట్లో మిగతా అలవాట్లు ఎలా వున్నా పిల్లల ఏడుపుని మాత్రం నీవు పూర్తిగా నిషేధించినట్టు కన్పిస్తోంది. అవునా?"

"పిల్లలు నవ్వితే ముచ్చటపడతాం. ఎప్పుడూ నవ్వుతూ వుండాలని కోరుకుంటాం. ఏడుపుని నవ్వులా ఆహ్వానించలేం కదా!పిల్లలు ఇద్దరినీ ఇంతవరకూ ఏడుపు రాగాలు తీయనీయకుండా అపురూపంగా పెంచాను" అని చెప్పాను గొప్పగా.

"నీవు ఏడ్వనివ్వకపోవడం కాదు. పిల్లల ఏడ్చి సాధిస్తున్నారు. అభిషేక్ తనకు కావల్సింది ఏడుపుతో డిమాండ్ చేయగల్గుతున్నాడు"

"పిల్లలు నా ప్రాణం. అడిగింది ఇవ్వకుండా ఎలా వుండగలను? ఒక కన్నీటి బొట్టు కార్చితే రక్తం కారినట్టు ఆందోళన చెందుతాను. ఏడుపుని ఆపడానికి వాడు అడిగింది అందుబాటులో వుంటే క్షణాల్లో ఇస్తాను. అభిషేక్‌తో చిక్కు ఏమిటంటే తను అడిగింది ఇమిడియట్‌గా కావాలంటాడు. సడన్‌గా ఎక్కడ నుంచి తేగలం? అంచేత రకరకాల బొమ్మలు కొని ఇంట్లో స్టాక్ వుంచుతాం. అవి వాడి దృష్టిలో పడకుండా జాగ్రత్తగా దాస్తాం. ఏడుపు సైరన్లు ఎంత చూసుకున్నా వారానికి నాలుగైదు వుంటాయి"

"ఈపాటికి వాడి గది అంతా బొమ్మలతో నిండిపోయి వుండాలే ..."

"వాడి చేతిలో బొమ్మ ఇరవై నాలుగ్గంటలకన్నా ఎక్కువ వుండదు. ముక్కలైపోయి డస్ట్‌బిన్‌లోకి చేరిపోతాయి"

"చుట్టుపక్కల తన ఈడు పిల్లలు లేకపోవడంతో బొమ్మలతో ఆడుకుంటాడు అనుకోవాలా?"

"అదేం లేదు. వాడి సైజు పిల్లలు నల్గురైదుగురు వున్నారు. మొదట్లో వాళ్ళతో బాగానే ఆడేవాడు. తర్వాత ఏడ్చుకుంటూ రావడం ప్రారంభించి, తర్వాత పిల్లలతో పూర్తిగా ఆడటం మానుకున్నాడు"

"పిల్లలు కొట్టేవారా?"

"కొట్టడం కాదు. ఏ ఆట ఆడినా వాడే గెలవాలి. తను కాకుండా ఎవడు గెలిచినా ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చేస్తాడు. ఏడుపు ఆపడానికి వాడి తాత

వాడితోబాటు పిల్లాడిలా ఆడి తను ఓడిపోయేవాడు. అంతే అభిషేక్ పిల్లలతో ఆడటం మానేసి తాతతో ఆడటం మొదలెట్టేడు. వాడితో అదేపనిగా ఆడలేక పాపం మావయ్యగారు నీరసించిపోతారు. అభిషేక్‌ని దెబ్బలాడితే 'పోనీలేమ్మా' అంటాడు మావయ్య"

"టీవీ చూస్తాడా అభిషేక్?"

"అదే పనిగా చూస్తాడు. వాడి పక్కన మళ్ళీ తాత కూడా వుండాలి. టీవీ చూస్తున్నంతసేపూ ఏవో చిరుతిళ్ళు తింటాడు. తినడం కాదు – తాత తినిపించాలి. టీవీని బుద్ధిగా కూర్చొని చూడడు. అందులో సాహసకృత్యాలు చూస్తూ, అదే రీతిలో అరుస్తూ, అభినయిస్తూ, వాళ్ళ తాతపై ప్రతాపం చూపిస్తాడు. ఆయన మనవాడి చేష్టల్ని ముచ్చటగా భరిస్తూ నవ్వుకుంటాడు.

"మా ఇంట్లో రెండు టీవీలున్నాయి. ఒకటి వాడి కోసం మరొకటి నాకోసం. నాకు ఇంట్లో టైంపాసు సీరియల్సే... నేను చూసే టీవీ హాల్‌లో వుంటే, వాడు చూసే టీవీ తాత గదిలో వుంటుంది. వాడు టీవీ చూస్తూ, తాతతో ఆడుతూ, అక్కడే తాత తినిపించగా అన్నం తిని, అక్కడే తాత మంచంపై నిద్రపోతాడు"

"చదువు కూడా తాత చెబుతాడా?"

"చదువు దగ్గర తాత మాట వినడు. ట్యూషన్‌కి వెళ్ళడు. చదువు నేను చెబుతాను. ఏమాత్రమైనా భయం వుందంటే అది నా దగ్గరే! మావయ్య సాయంత్రం గంటా, రెండు గంటలు సీనియర్ సిటిజన్సు మిత్రులతో పార్కులో గడుపుతాడు. నేను చదువు చెబుతున్నంతసేపూ మావయ్య ఇంటికి రాకుండా జాగర్త పడతాడు. తను ఇంటికొస్తే మరి చదవడు"

"తాత ఇంట్లో లేనంతసేపూ నీ మాట వింటాడన్నమాట"

"వినడం కాదు చచ్చినట్లు ఏం చెబితే అది చేస్తాడు"

"అభిషేక్ చదువు బాగానే సాగుతోందా?"

"లేదు. నాకు తృప్తిగా లేదు. చాలా తెలివైన వాడు. వాడి స్థాయికి తగ్గట్టు చదవడం లేదని నాకు బాధగా వుంటుంది".

"బాధగా వుండదా మరి. ఇంట్లో అందరూ బాగా ముద్దు చేయడంతో మొద్దు అవతారం ఎత్తుతున్నాడు. మీవారికి ఇంటి విషయాలు ఏమీ పట్టవు. మీ మావయ్యగారు మీపై పూర్తిగా డిపెండెంటా?"

"అయ్యో! తనకి పాతిక వేల పెన్షన్ వస్తుంది. రిటైర్డ్ ప్రొఫెసర్. ఆయనకి మావారు కాక ఇద్దరు కొడుకులున్నారు. పెద్ద కొడుకు బెంగుళూరు. చిన్న కొడుకు

అమెరికా. వాళ్ళు తమ దగ్గర వుండమని ప్రార్థిస్తారు. తనకీ వెళ్ళాలనే వుంటుంది. కానీ మా అభిషేక్‌తో అటాచ్‌మెంట్ ఎక్కువ. తనని వదలి వెళ్ళొద్దని వాడు ఏడుస్తాడు. ఈ మనవడి కోసం ఆయన మొత్తం ప్రపంచాన్నే వదులుకున్నాడు పాపం"

"నేనొకటి చెబుతాను. చేస్తావా?"

"ఏమిటి?"

"తక్షణం మీ మావయ్యని ఇంట్లోంచి బయటకి పంపించేయండి. రైలెక్కి బెంగుళూరు వెళతాడో, విమానమెక్కి అమెరికా వెళ్తాడో ఆయన ఇష్టం. మీ ఇంట్లో మాత్రం వుండటానికి వీల్లేదు"

"అయ్యబాబోయ్! ఇదేమి సలహాయే తల్లీ. మావయ్య లేకుండా ఎలా వుండగలం? అభిషేక్ పిచ్చోడు అయిపోతాడు. నేను హేండీకాప్ అయిపోయి బిక్కచచ్చిపోతాను"

"తల్లీ కొడుకులు ఆ ముసలాయనపై అంతగా డిపెండెంట్ అయిపోయేరు మరి. వార్ధక్యంలో విశ్రాంతి బదులు చాకిరీతో ఆయన నడుం విరిగిపోతోంది. ఒక రకంగా మీ ఇద్దరూ స్వార్థపరులే... ఏమిటి రేవతీ మీ మావయ్య లేకుంటే ఇల్లే లేనట్టు నీవే లేనట్టు మాటాడుతున్నావ్? నీవేం ఉద్యోగాలు చేస్తున్నావా? పిల్లలు ఇద్దరినీ నీవే చూసుకోవాలి. ఒక తల్లిగా పిల్లల బాధ్యత నీదే తప్పా 'తాత'ది కాదు. మహా అయితే నీవు త్యాగం చేయాల్సింది టీవీ సీరియల్స్ మాత్రమే! ఆ ఇడియట్ బాక్స్‌తో గడిపే టైము నీవు పిల్లలతో గడిపితే నీకూ, పిల్లలకీ ఆరోగ్యం. ఇంటిని నీ ఒక్కదానివి చూసుకోలేకపోతే మీ ఆయన చొక్కా ఫిల్లర్ పట్టుకుని ఫీల్డులోకి దించు. పిల్లలని సక్రమంగా పెంచలేని తల్లిదండ్రులకు పిల్లలను కనే హక్కు, అర్హత లేదు. అలాంటి మనషులకన్నా పశువులు నయం. పశువులే, పిల్లల్ని చక్కగా చూసుకుంటాయి. మానవ సంబంధాల విషయంలో మన వాళ్ళు అమెరికన్లను చులకనగా మాటాడుతారుకాని పిల్లలతో వాళ్లే మనకన్నా ఎక్కువ సమయం గడుపుతారు, ప్రేమాభిమానాలు పంచుతారు తెల్సా?"

"ఒప్పుకుంటాను. తల్లిదండ్రులే పిల్లలపట్ల బాధ్యత పూర్తిగా వహించాలి. కాని మా కేసు వేరు. మధ్యలో హఠాత్తుగా మా అభిషేక్ తాతను మిస్ అవుతే ఏమాత్రం తట్టుకోలేడు. వాడికి తాతంటే ప్రాణం. తాత లేకుండా వాడిని వూహించు కోవడానికే నాకు భయంగా వుంది"

"ఫూలిష్‌గా మాటాడకు రేవతీ! నేనొకటి అంటాను... ఏమీ అనుకోకు.

సడన్‌గా మీ మావయ్య గుండాగి ఈ క్షణం చచ్చిపోయాడనుకో.. ఏమవుతుంది? మీ ఇల్లు తలకిందులైపోతుందా? తాత శవాన్ని అభిషేక్ కావలించేసుకుని వెక్కి వెక్కి ఏడుస్తాడా? అసలు ఏడుస్తాడా? నీవు, మీ ఆయన బాధపడిన దాంట్లో పదో వంతు కూడా బాధపడడు. అవును. ఇది సత్యం. పిల్లల ప్రేమలు బలీయమైనవి కావు. ఒకవిధంగా వాళ్ళది స్వార్థం. అది సహజ లక్షణం. రేవతీ ఇది చాలా సీరియస్ మాటర్. నీవు వర్రీ అవ్వవలసింది నీ కూతురు తిండి కోసం కాదు. కొడుకు భవిష్యత్ గురించి. అర్థమయిందా?"

అది సీరియస్ మాటర్ అంటే నాకు నవ్వొచ్చింది.

"అభిషేక్ పెరుగుతున్న తీరు సరైంది కాదని నీవిప్పుడేగా చెప్పావు. ఈ విషయం మా శ్రీవారితో మాటాడి ఒక నిర్ణయానికొస్తాం. సరేనా?"

"ఎప్పుడు? మీ ఆయనతో చర్చలు, ఆలోచనలు కాదు. ఇమీడియట్‌గా మీ ఇంటి నుంచి తాత భూతాన్ని తరిమి కొట్టాలి. రేవతీ, నేను ఈ విషయంలో ఓవర్‌గా రియాక్ట్ అవుతున్నట్టు అనిపించవచ్చు. నేను పిల్లలకన్నా సెన్సిటివ్. అభిషేక్ వున్న స్థితిలో ఏ పిల్లవాడు వున్నా, వాడి తల్లితో ఇలానే మాటాడతాను"

"నీలో మంచి డాక్టర్‌ని చూస్తున్నాను అనితా" అన్నాను.

"నాలో తల్లిని చూడు. నా బాధ అర్థమవుతుంది"

నిజమే! నాకు అర్థమవుతోంది. తను చెప్పేవన్నీ పాయింట్సే అనిపిస్తున్నా, మావయ్యను హఠాత్తుగా ఇంటినుంచి వెళ్ళగొట్టడం, నాకెందుకో అది అమానుష చర్యగా, విశ్వాసరాహిత్యంగా కన్పిస్తోంది.

ఇంతలో ఒక్కసారిగా నా కూతురు దీప్తి కేర్‌మంది. తుళ్ళి పడ్డాను. నా ప్రాణాలు పైకి ఎగిరిపోయేయి. కింక పెడుతూ నేలపై పొర్లుతున్నదాన్ని పరుగున వెళ్ళి గభాల్న ఎత్తుకున్నాను. ఎత్తుకున్నా వుండటం లేదు. నేను దాన్ని కాయ లేకపోతున్నాను. తూలిపోతున్నాను.

"నీవెందుకలా కిందామీదా అయిపోతావ్? దీప్తిని కిందకి దించేయ్" అంది అనిత.

నేలపై కూర్చోబెట్టి ఏవేవో బొమ్మలు ఇచ్చాను. ఛిసిరి కొట్టింది. నేను తెచ్చిన బిస్కట్ పాకెట్ విప్పి, బిస్కట్ తినిపించబోయాను. విసిరి కొట్టింది. బిస్కట్లు చెల్లాచెదురుగా పడిపోయేయి. కాళ్ళూ, చేతులు కొట్టుకుని ఫిట్స్ వచ్చిన దానిలా, పెంకు లెగిరిపోయేలా ఏడుస్తోంది. నా ప్రాణాలు పైపైకి ఎగిరిపోతున్నాయి.

అనిత నా దగ్గరకు వచ్చి నన్ను దూరంగా, దీప్తికి కాస్త దూరంగా తీసుకు

పోయింది.

"దీప్తిని అలా ఏడ్వనియ్. నీవేం పట్టించుకోకు. అసలు అటువైపు చూడకు" అని చెవిలో చెప్పినంత రహస్యంగా చెప్పింది. కాసేపు ఆ పిల్ల ఎవరో అన్నట్టు మర్చిపొమ్మంది. నాకు బొత్తిగా సాధ్యంకాని పని. కాని అనిత ఒత్తిడి నా కాళ్ళూ చేతుల్నీ కట్టిపడేశాయి.

అసలు దీప్తిని ఏడిపించింది అనితే! అంతవరకూ అది నన్ను ఇబ్బంది పెట్టకుండా బొమ్మలతో ఆడుకుంటూ, ఆడుకుంటూ లేచి వెళ్ళి టీపాయ్ మీద వున్న టీవి రిమోట్‌ని నోట్లో పెట్టుకొని ఐస్ క్రీమ్‌లా చప్పరించేస్తోంది. అది అనిత చూసి గభాల్న రిమోట్‌ని లాక్కుంది.

రిమోట్ లాక్కోవడంతో ఒకటే కింక. దీప్తి ఎంత మొండిదో నాకు తెలుసు. తన చేతిలో లాక్కున్న వస్తువు ఏదైనప్పటికి తిరిగి ఇచ్చేవరకూ ఏడుపు ఆపదు.

దీప్తి అలా ఏడుస్తుంటే నేను తట్టుకోలేకపోయేను.

"అనితా ప్లీజ్. దానికి రిమోట్ ఇచ్చేద్దూ" అని బ్రతిమాటాడేను.

నాపై కయ్ మంది అనిత.

"నీకు బుద్ధి వుందా? పిల్లకంటే తెలీదు. నీకేమయ్యింది? ఆ రిమోట్‌పై ఎవరెవరి చేతులు ఎన్నెన్నిసార్లు తాకాయో.. ఆ తాకిన చేతులు శుభ్రమైనవి మాత్రం కావు. రిమోట్‌పై ఈ మురికి చూడు. కనబడని బాక్టీరియా ఇంకెంతో. ఏడుస్తుందని చెప్పి రోగాల రిమోట్‌ని పిల్ల నోటికి అందిస్తామా?

రేవతీ! ఎందుకు నీవు పిల్లల ఏడుపు చూసి జ్వరం తెచ్చుకుంటావ్? పిల్లల్ని ఏడ్వనివ్వాలని నీకు తెలీదనుకుంటాను. వాళ్ళని మనసారా, కసితీరా శుభ్రంగా లోన కడిగేసుకున్నట్టు ఏడ్వనివ్వాలి. రీఛార్జ్ కానివ్వాలి. ఒక జీవశక్తి పుంజుకో నివ్వాలి.

బిడ్డ పుట్టినప్పుడే తనివితీరా ఏడుస్తుంది. అంత తృప్తిగా ఏడ్చే అవకాశం మళ్ళీ ఆ బిడ్డకు తల్లి ఇవ్వదు. చిత్రంగా పిల్లలను ఏడ్వనివ్వని ఆ తల్లులే కొందరు ఏవో కారణాలవల్ల వెక్కి వెక్కి ఏడుస్తూనే వుంటారు. ఏడ్చే వాళ్ళ గుండె బరువంతా కన్నీళ్ళలో కారిపోయేలా పూర్తిగా ఏడ్వనీయమని వదిలేస్తారు పెద్దలు. అవునా?

గత కాలంలో పుట్టిన పిల్లలకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఒక వ్యాయామం కచ్చితంగా వుండేది. పిల్లలకు ఎముకలు వుండవన్నట్లు సర్కస్ పిల్లకు మల్లే కాళ్ళూ, చేతులూ, మెడ విరిచేసేవారు. చెమటలు కక్కించేవారు, కింకపెట్టేలా ఏడ్వనిచ్చేవారు. ఆ పిల్లలు బలంగా, ఆరోగ్యంగా వుండేవారు."

ఈ రోజుల్లో పిల్లలను ఎలా పెంచుతున్నాం? ఏసి గదిలో నలిగిపోకుండా, కన్నీళ్ళు కారిపోకుండా జాగర్తగా పువ్వుల్లో పెట్టి పెంచుతున్నాం. పిల్లలకు వ్యాయామం ఎలానూ లేదు గనుక ఆడుకోనివ్వాలి. కాని ఆడుకోనివ్వం. ఏడుస్తున్నప్పుడు ఏడ్వనివ్వాలి. కాని ఏడ్వనివ్వం. పిల్లల ఏడుపు ఒక యోగా లాంటిది. 'వీపింగ్ క్లబ్' పేరుతో పెద్దవాళ్ళు ఏడిస్తే అసహ్యంగా వుంటుంది. గనుక 'లాఫింగ్ క్లబ్' అన్నారు. ఒంట్లో నరాలన్నీ జీవశక్తితో వీణ తీగల్లా మోగేలా కృత్రిమంగా పకపకమంటున్నారు. నవ్వూ, ఏడుపూ రెండూ శరీరానికి కావల్సిన ఔషధాలే" అంది అనిత.

ఇంకా ఏవేవో కబుర్లు చెప్పుకుంటుండగా అనిత నన్ను ఒకసారి దీప్తి వైపు చూడమంది. చూసేను. నమ్మలేనట్టు చూసేను. దీప్తి ఏడ్వడం లేదు. ఏడ్చి ఏడ్చి అలసిపోయినట్టుంది. తన డిమాండ్ సాధించకుండా సరెండర్ అయిపోవడం ఇదే మొదటిసారి.

అంతకన్నా నాకు ముచ్చట కలిగించింది ఏమిటంటే తినిపించినా తినకుండా విసిరికొట్టిన బిస్కట్లను ఏరుకొని ఆకలితో వున్నట్టు ఆబగా తింటోంది.

నా కూతురిపై విపరీతమైన ప్రేమ పొంచుకొచ్చేసి ఎత్తుకొని ముద్దులాడ టానికి దీప్తి వద్దకు పరిగేట్టేను.

ఇక ఇంటికి బయల్దేరడానికి సిద్ధపడుతుంటే, "ఒక్క నిముషం" అంటూ నిలబెట్టేసింది అనిత నన్ను.

అనూహ్యం!

నవ్వుతూ నా నుదుట బొట్టుపెట్టి, ఖరీదైన పట్టుచీర పెట్టి, పిల్లల కోసం విలువైన అమెరికా బహుమతులు అందజేయడంతో నిశ్చేష్టురాలినైపోయాను.

అమూల్యమైన సలహాలు ఎలానూ ఇచ్చింది.

నా కళ్ళు తడి అయ్యేయి. చేతులెత్తి నమస్కరించబోతే కోప్పడి, ఆత్మీయంగా నన్ను కావలించుకుంది అనిత. ఇంటికి వెళ్ళిపోయేను.

అంతటితో వూర్కోలేదు అనిత.

ట్రాఫిక్‌లో ఇరుక్కుపోకుండా ఇంటికి క్షేమంగా చేరావుకదా అంటూ ఆ రాత్రి ఫోన్ చేసింది.

తర్వాత ఆ ఫోన్ ముందు మా శ్రీవారికీ, తర్వాత మావయ్యకీ ఇవ్వమనడం తో ఎందుకు ఫోన్ చేసిందీ అర్థమయిపోయింది.

నాపై నమ్మకంలేకే ఆ సమస్య పరిష్కారాన్ని తన నెత్తిపై వేసుకొని మావయ్య

తో అరగంటకుపైగా మాటాడింది.

అభిషేక్‌తో కూడా మాటాడబోయిందిగాని వాడు సిగ్గుపడి మాటాడలేదు.

తర్వాత మావయ్యతో నేను, మావారు చాలాసేపు మాటాడేం. అనిత చెప్పినదేమీ పట్టించుకోవద్దని ప్రార్థించేం.

"లేదమ్మా! అనిత చెప్పిన పాయింట్స్‌తో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. ఇది ఎప్పుడో మనమే నిర్ణయం తీసుకొని చేసుండాల్సిన పని. నేను బెంగుళూరు వెళ్ళిపోతున్నాను. నన్ను ఆపకండి ప్లీజ్" అన్నారు మావయ్య.

నేను ఏడ్చినా, మా మావయ్య ప్రయాణం ఆగలేదు.

***

అభిషేక్‌లో అనూహ్యమైన, మంచి మార్పు రావడంతో మావద్ద మావయ్య లేని లోటుని వేగంగా మర్చిపోగలిగేను.

వాడి చదువు దగ్గర నుంచి మొత్తం అన్ని విషయాలలోనూ నేను, మా శ్రీవారు తృప్తి చెంది గర్వంగా వుండగలుగుతున్నాం.

థాంక్స్ టు మావయ్య అండ్ అనిత!

అయితే అప్పుడప్పుడు ఏదో గుర్తుకొచ్చినట్టు తాత కావాలని ఏడుస్తాడు. దానికి మా నుంచి ఎలాంటి స్పందనా వుండదు. అభిషేక్ ఏడ్చినా, దీప్తి ఏడ్చినా వాళ్ళ ఏడుపు వాళ్ళదేగాని మేము పట్టించుకోం (ఒక్క ఆరోగ్య విషయంలో తప్ప). ఏడ్చే ఏడుపుని బహుమతులతో ఆటంకపరచబోం.

దీప్తి అంత చిన్న వయసులోనూ బుద్ధిగా అన్నతో కూర్చొని బుద్ధిగా తింటోంది. తినిపించకుండా తింటోంది.

ఇపుడు నా సమస్య ఏమిటంటే దీప్తి బరువు రోజు రోజుకీ పెరుగుతోంది.

**(చలం 'బిడ్డల శిక్షణ' చదివేక.)**

*రచన-ఆగస్టు 2012*